రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం	సహరి ఆదివారం
కర్నూలు	6:32	5:09
నంద్యాల	6:29	5:09

అడవి తల్లులు

అటవీ శాఖలో రాణిస్తున్న మహిళా ఉద్యోగులు

ఆత్మకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అటవీ శాఖలో మహిళా ఉద్యోగులు రాణిస్తున్నారు. వనరక్షణలో ధీరత్వాన్ని ప్రదర్శిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. నల్లమలలోని నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వు ఫారెస్ట్ దేశంలోనే అతిపెద్దది.. ఇందులో రేంజ్‌లు, సెక్షన్‌లు, బీట్‌ల విస్తీర్ణం అధికంగా ఉన్నప్పటికీ వాటి పరిధిలో మహిళా ఉద్యోగులు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

అటవీ శాఖలో 38 మంది మహిళా ఉద్యోగులు

ఉమ్మడి జిల్లాలోని కర్నూలు జిల్లా పరిధిలోని అటవీశాఖలో మొత్తం 38 మంది మహిళా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో కర్నూలు డివిజన్‌కు సంబంధించి ఒక రేంజ్ అధికారి, ఒక ఎఫ్ఎస్ఎఫ్, ముగ్గురు ఎఫ్‌బీవోలు, ఇద్దరు ఏపీబీలుగా పనిచేస్తున్నారు. అలాగే ఆత్మకూరు డివిజన్‌లో నలుగురు ఎఫ్ఎస్‌వోలు, ఏడుగురు ఎఫ్‌బీవోలు, ఒక ఏబీవో ఉన్నారు. నంద్యాల డివిజన్‌లో ఇద్దరు డీఆర్వోలు, ముగ్గురు ఎఫ్ఎస్‌ఓలు, ఐదుగురు ఎఫ్‌బీవోలతో పాటు నంద్యాల టెరిటరీ పరిధిలో మరో ఆరుగురు మహిళా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రత్యేకించి ఆత్మకూరు డివిజన్ పరిధిలోని పలు కీలకమైన సెక్షన్లు, బీట్‌లలో మహిళా సిబ్బంది విధుల్లో రాణిస్తున్నారు. గతంలో అటవీశాఖలో డిప్యూటేషన్ విధానం వుండటం వల్ల మహిళా సిబ్బందికి కొంత ఊరట ఉన్నప్పటికీ ప్రస్తుతం డిప్యుటేషన్ల ప్రక్రియ రద్దు కావడంతో తప్పని పరిస్థితుల్లో కీలకమైన ప్రాంతాల్లో విధులు చేపడుతుండటం గమనార్హం. అడవి తల్లికి సేవలందించడం ఆనందంగా ఉందని గువ్వకుంట్ల సెక్షన్ ఎఫ్ఎస్ఓ జి.మహేశ్వరి, రుద్రకోడూరు బీట్ ఆఫీసర్ లక్ష్మీదేవి పేర్కొంటున్నారు.


విధుల్లో భాగంగా అడవిలో వెళ్తున్న మహిళా ఉద్యోగులు


పెద్దపులి పాదముద్రలను సేకరించిన అటవీ శాఖ మహిళా ఉద్యోగులు


నల్లమలలో వన్యప్రాణుల పగ్‌మార్కులను సేకరిస్తున్న దృశ్యం

ప్రకృతికి సేవలందించడం ఆనందంగా ఉంది



2008లో అటవీ శాఖలో ఎఫ్‌బీవోగా విధుల్లో చేరి ప్రస్తుతం ఆత్మకూరు రేంజ్ పరిధిలోని గువ్వలకుంట్ల సెక్షన్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. పలు సందర్భాల్లో విధి నిర్వహణ కొంత భయాన్ని కలిగించినప్పటికీ సహచర సిబ్బంది సహకారంతో ఉన్నతాధికారుల సూచనలతో విధి నిర్వహణలో చక్కగా రాణిస్తున్నాం. పైగా ప్రకృతికి సేవలందించడం ఆనందంగా ఉంది. తొలుత అటవీ శాఖలో ఉద్యోగమంటే భయపడినప్పటికీ ప్రస్తుతం ఎంతో ధైర్యంతో విధులు చేపడుతున్నాం. యూనిఫామ్ సర్వీసులో పని చేయడం గర్వపడుతున్నాం.

\- జీ మహేశ్వరి, ఎఫ్ఎస్ఓ, గువ్వకుంట్ల సెక్షన్, ఆత్మకూరు రేంజ్

యూనిఫారమే కొండంత అభయం



అటవీ సంరక్షణలో యూనిఫారమే మాకు కొండంత అభయాన్ని అందిస్తోంది. ప్రకృతికి సేవ చేయడం పరోక్షంగా ప్రజలకు మేలు చేయడమన్న భావనతో ముందుకెళ్తున్నాం. పలు సందర్భాల్లో ఎలుగుబంట్లు, చిరుతల తారసపడినప్పటికీ చాకచక్యంతోనే సురక్షితంగా తప్పించుకున్నాం. అటవీ రక్షణలో ఉండగా ఎలుగుబంట్లు వెంబడించిన సందర్భాలు ఉన్నప్పటికీ వాటన్నింటిని ధైర్యంగా ఎదుర్కొన్నాం. అయితే ఇటీవల మా శాఖలో డిప్యుటేషన్ విధానం రద్దు కావడం వల్ల కొందరు మహిళా సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులు పరిష్కరించాలని కోరుతున్నాం.

\- లక్ష్మీదేవి, రుద్రకోడూరు బీట్, బైర్లూటి రేంజ్

పన్నుల వసూలులో నిర్లక్ష్యం..!

జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీలో పన్నుల బకాయిలు రూ. కోట్లలో పేరుకుపోయాయి. అధికారులు, సచివాలయాల సిబ్బంది పన్నులు వసూలు చేయడం లేదు. మున్సిపాలిటీల వారిగా రూ.43.99 కోట్ల బకాయిలు ఉన్నాయి. ఇది పలు అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. 2024-25 సంబంధించిన పన్నులతో పాటు పాత పెండింగ్ పన్నుల బకాయిలు కూడా సుమారు రూ.20 కోట్లు ఉన్నాయి. పైగా వచ్చే మరికొన్ని రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఇప్పటికైనా అధికారులు, సిబ్బంది స్పందించి పన్నుల వసూళ్లలో వేగం పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- జిల్లాలో పేరుకుపోయిన రూ. 43.99 కోట్ల బకాయిలు
- పాత బకాయిలదీ అదే పరిస్థితి
- మున్సిపాలిటీల్లో కనిపించని అభివృద్ధి

నంద్యాల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఎక్కడ చూసినా ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు కాలేదు. కొన్నిచోట్ల 30 శాతం పన్నులు కూడా వసూలు చేయలేదు. ప్రధానంగా నంద్యాల, డోన్, నందికొట్కూరు మున్సిపాలిటీలో వసూళ్లు పూర్తిగా పడిపోయాయి. పెండింగ్ బకాయిల్లో ఎక్కువ శాతం ఆస్తి పన్నులు, నీటి పన్నులతో పాటు పలు దుకాణాలు అద్దెలు కూడా పేరుకుపోయాయి. నంద్యాలలో పరిస్థితి మరీ దారుణం ఉంది. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా.. మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల పన్నులు పేరుకపోయాయి.

పన్నుల వసూలులో అధికారులు, సిబ్బంది ప్రణాళికబద్ధంగా వ్యవహరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. కొందరు అధికారులు, సిబ్బంది పన్నుల వసూలు చేయకుండా ఆదాయం వచ్చే పనుల్లో నిమగ్నమయ్యారనే ఆరోపణలు లేకపోలేదు. కొందరు అధికారులు నోటీసులతో సరిపెట్టుకుంటున్నారు. అధికార లెక్కల ప్రకారం.. 2024-25 కింద రూ. 68.39 కోట్లు వసులు చేయాల్సి ఉండగా.. రూ. 24.40 కోట్లు మాత్రమే వసూలు చేయగా.. రూ. 43.99 కోట్లు ఇప్పటికి పెండింగ్‌లో ఉన్నట్లైంది. ఇక పాత పెండింగ్ బకాయిలు పరంగా చూస్తే.. ఇప్పటికి సుమారు రూ. 20 కోట్లు బకాయిలు ఉండగా.. కేవలం నంద్యాలలోనే.. రూ. 13.73 కోట్లు పెండింగ్‌లో ఉండటం గమనార్హం. ఇదిలా ఉండగా.. ఆయా మున్సిపాలటీల పరిధిలో వందల మంది సచివాలయ సిబ్బంది ఉన్నప్పటికి ఇంటి, నీటి పన్నులు సైతం రూ. కోట్లలో పేరుకుపోవడం పలు విమర్శలకు తావిస్తోంది.

మున్సిపాలటీల అభివృద్ధిపై ప్రభావం....

పన్నుల వసూళ్లలో అధికారులు సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఎక్కడిక్కడ పలు అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో చేయడం లేదు. ఆస్తి పన్నులు, నీటి పన్నులు సైతం అన్నిటి కంటే ఎక్కువ శాతం పెండింగ్‌లో ఉండటం మరింత కలవరం రేపుతోంది.


నంద్యాల మున్సిపాలిటీ


డోన్ మున్సిపాలిటీ

మున్సిపాలిటీల పేర్లు	2024-25 డిమాండ్ (రూ.కోట్లలో)	వసూల్లు రూ.కోట్లలో	పెండింగ్ రూ. కోట్లలో
నంద్యాల	25.18	10.76	14.42
బేతంచెర్ల	3.70	1.20	2.50
డోన్	13.50	3.34	10.16
ఆళ్లగడ్డ	6.78	2.70	4.08
నందికొట్కూరు	10.80	4.15	6.65
ఆత్మకూరు	8.43	2.25	6.18
మొత్తం	:68.39	24.40	43.99



నందికొట్కూరు మున్సిపాలిటీ

పన్నులు వసూలు చేయాలని అదేశించాం..

జిల్లా వ్యాప్తంగా మున్సిపాలటీల వారిగా రూ. కోట్లలో పన్నులు పెండింగ్‌లో ఉన్న విషయం వాస్తవమే. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు ఎక్కడిక్కడ కమిషనర్లు ప్రత్యేక ప్రణాళికబద్ధంగా పన్నులు వసూలు చేయాలని అదేశించాం. బకాయిలపై కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

-మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్

మున్సిపాలిటీల వారిగా వార్డులు ఇలా..

నంద్యాల	: 42
బేతంచెర్ల	: 26
డోన్	: 32
ఆళ్లగడ్డ	: 27
నందికొట్కూరు	: 29
ఆత్మకూరు	: 24

మెగా డీఎస్సీకి ఉచిత ఆన్‌లైన్ శిక్షణ

నంద్యాల నూనెపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీకి సిద్ధపడుతున్న బీసీ అభ్యర్థులకు ఉచిత ఆన్‌లైన్ శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ కేటగిరీలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులే సొంత జిల్లాలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. నంద్యాల బొమ్మలసత్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఉన్న జిల్లా వెనుకబడిన తరగతుల సాధికారిక అధికారి కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

వైద్య ఆరోగ్య శాఖలో పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న ఎంపీహెచ్‌ఈవో, పీహెచ్ఎన్ (టీచింగ్)లకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లుగా ఈ నెల 11వ తేదీ పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డా.కే పద్మావతి, ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 11న సంబంధిత డీఎంహెచ్‌వో కార్యాలయంలో జూమ్ కౌన్సెలింగ్ ద్వారా ఉదయం 11గంటలకు జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 56 మందికి పదోన్నతుల కౌన్సెలింగ్ జరగనుండగా.. కర్నూలు జిల్లాలో ఆరుగురు, నంద్యాల జిల్లాలో ఏడుగురు ఉన్నారు. కర్నూలు జిల్లాల నుంచి కే వెంకటలక్ష్మి, పి.స్వర్ణలత, కే.రాణి ఎస్తేర్, టీ లీలావతి (ఆర్‌టీసీ ఫీమేల్), పి.రామకృష్ణయ్య (కోసిగి పీహెచ్‌సీ), ఎ.రాజశేఖర్, (పొలకల్ పీహెచ్‌సీ), నంద్యాల జిల్లా నుంచి ఎస్‌వీ మురళీకృష్ణ (డీఎంహెచ్‌వో కార్యాలయం, నంద్యాల), వి.లక్ష్మీనారాయణ (పేరుసోముల పీహెచ్‌సీ) బీసీ వుశేన్ రెడ్డి (గాజులపల్లె పీహెచ్‌సీ) ఎస్ఎండీ సైఫుల్లా (కొత్తబురుజు పీహెచ్‌సీ), ఎన్.వెంకటేశ్వర్లు (టంగుటూరు పీహెచ్‌సీ), బి.చంద్రశేఖర్ (ఎర్రమఠం పీహెచ్‌సీ) పదోన్నతుల జాబితాలో ఉన్నారు.

డిప్యుటేషన్ డ్యూటీ..!

7


- రుద్రవరం వదిలి చాగలమర్రిలో విధులు
- అక్కడ ఒకేషనల్ టీచర్ ఉన్నా నియామకం
- ఐదేళ్లుగా రెగ్యులర్ స్థానం ఖాళీ

నృసింహుని బ్రహ్మోత్సవం..

- హంస, సూర్యప్రభ వాహనాలపై ప్రహ్లాద వరదస్వామి
- హనుమంత వాహనంపై జ్వాలా నారసింహుడు
- ఎగువ, దిగువ అహోబిలాల్లో వైభవంగా ఉత్సవాలు



ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 7(ఆంధ్రజ్యోతి) : నల్లమలలోని అహోబిల నారసింహుడి క్షేత్రాలు భక్తుల గోవింద నామస్మరణతో ప్రతిధ్వనిస్తున్నాయి. దిగువ అహోబిలంలో మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప రంగనాథ యతీంద్ర మహాదేశికన్ శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చనలు నిర్వహించారు. ప్రహ్లాదవరదస్వామి ఉభయ దేవేరులతో పల్లకిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రహ్లాదవరదస్వామి రాజహంస వాహనంపై, రాత్రి సూర్యప్రభ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు.


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహదేశికన్

హనుమంత వాహనంపై జ్వాలా నరసింహస్వామి :

ఎగువ అహోబిలంలో శ్రీదేవి, భూదేవి సమేత జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అమ్మవార్లకు యోగా నృసింహ గరుడ విమాన సేవను నిర్వహించి తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. విశేషంగా అలంకరించిన హనుమంత వాహనంపై జ్వాలా నరసింహస్వామిని కొలువుంచి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.


ఉభయ దేవేరులతో దర్శనమిస్తున్న జ్వాలా నరసింహస్వామి

బ్రహ్మోత్సవాల్లో నేడు

అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎగువ అహోబిల క్షేత్రంలో జ్వాలా నరసింహస్వామి ఉదయం శేష వాహనంపై, రాత్రి చంద్రప్రభ వాహనంపై విహరించనున్నారు. దిగువ అహోబిలంలో ప్రహ్లాదవరదస్వామికి ఉదయం గరుడ విమానసేవ, రాత్రి హనుమంత వాహనసేవ నిర్వహిస్తారు.

మహిళా దినోత్సవ కథనాలు 6లో..



ఆదర్శ కీర్తన

వెలుగోడు మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఓ యువతి మారుమూల గ్రామీణ ప్రాంతం నుంచి ఎస్ఐగా నియమితులయ్యారు. వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామం వ్యవసాయ కుటుంబానికి చెందిన వెంకటేశ్వర్లు, సరోజిని దంపతుల రెండో కుమార్తె నాగ కీర్తన. ఈమె 1 నుంచి 7వ తరగతి వరకు స్వగ్రామం గుంతకందాల గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో చదువుకున్నారు. 8 నుంచి 10 వరకు వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంటర్ నలంద నంద్యాల కాలేజీలో డిగ్రీ నంద్యాల నేషనల్ కళాశాలలో చదువుకున్నారు. 2020 నుంచి మూడేళ్ల మిడ్తూర్‌లో కానిస్టేబుల్‌గా పని చేశారు. ఎస్ఐగా శిక్షణ పూర్తి చేసుకున్న ఆమెను కడప జిల్లాకు కేటాయించారు.



సమాజంలో మహిళల పాత్ర కీలకం

- జయమ్మ, డీడీ, సమాచార శాఖ



నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. సమాజంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. పరిపాలన, రాజకీయ రంగాల్లో మహిళలు భాగస్వామ్యం గణనీయంగా పెరిగి, కీలకమైన నిర్ణయాల్లో ప్రధానపాత్ర పోషించడం విశేషం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళకలు సమాన అవకాశాలు, హక్కులు కల్పిస్తూ మహిళల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి. మహిళలకు గౌరవం పెంచేలా, సాధికారత దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలు అమలు చేస్తున్నాయి. మహిళా శక్తి క్రమేణా పెరుగుతోంది. కర్నూలు జిల్లాలో కూడా కీలకమైన చాలా శాఖలో మహిళ అధికారులు వారి వారి శాఖలో చురుగ్గా సమర్థవంతంగా పని చేస్తున్నారు. ఆడపిల్లలు బాగా చదువుకుని తమ కుటుంబంతో పాటు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలి.

- కర్నూలు కలెక్టరేట్

మహిళలకు రక్షణ ఏదీ..?



కర్నూలు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా గత ఐదేళ్లలో మహిళలపై నేరాలు పెరిగాయి. యువతులు, బాలికలపై లైంగిక దాడులు ఎక్కువయ్యాయి. గృహ హింస పెరిగింది. పోలీస్ స్టేషన్లకు వచ్చే బాధితురాళ్ల సంఖ్య పెరిగిపోయింది. గత ప్రభుత్వం దిశా చట్టం తెచ్చినా గత ఐదేళ్లలో మహిళల రక్షణకు పెద్దగా శ్రద్ధ చూపలేదు. వైసీపీ ప్రభుత్వం మహిళల కోసం కొత్త దిశా చట్టం తెచ్చింది. ఈ దిశా చట్టమే కొంత మంది పోలీసు అధికారులకు కాసుల వర్షం కురిపించింది. కొద్ది నెలల్లోనే కేసులు ట్రయల్‌కు వచ్చేలా చేస్తామని, నిందితులకు శిక్షలు పడేలా చేస్తామని చెప్పిన ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దిశా పోలీస్ స్టేషన్‌ను రూపురేఖలు మార్చి తిరిగి మహిళా పోలీస్ స్టేషన్‌గా ఏర్పాటు చేసింది. గతంలో దిశా పోలీస్ స్టేషన్‌లో అంతా పురుషులే అధికారులుగా ఉండగా.. ఒకరిద్దరు మాత్రమే మహిళా పోలీసు అధికారులు ఉండేవారు. ప్రస్తుతం పురుషుల సంఖ్యను తగ్గిస్తూ మహిళా పోలీసుల సంఖ్యను పెంచుతున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మహిళలపై నేరాలు తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నారు.

అమ్మ, నాన్నల ప్రోత్సాహంతోనే...

● వెంకట నారాయణమ్మ, డీఆర్వో, కర్నూలు




మాది అనంతపురం జిల్లా. వ్యవసాయ కుటుంబం. అమ్మాయిలు చదువుకుంటేనే కుటుంబం బాగుంటుందని అమ్మా నాన్న ఆకాంక్షించేవారు. గమ్యం, ఉద్దేశం, లక్ష్యం ఏర్పరుచుకుని ప్రణాళిక ప్రకారం సిద్ధమవ్వాలి అని తల్లిదండ్రులు ఎప్పుడూ సూచించేవారు. వారి ఆలోచనలకు అనుగుణంగా కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించుకున్నాను. నేటి తరం అమ్మాయిలు తల్లిదండ్రులు సూచనలు పాటిస్తూ ఉన్నత స్థానానికి ఎదగాలి. క్రమశిక్షణతో మెలగాలి. మహిళలు చదువుకుంటే సమాజం అభివృద్ధి చెందుతుంది.

-కర్నూలు కలెక్టరేట్

ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది

- గురజాడ



- ఆత్మవిశ్వాసమే వనితల తొలిమెట్టు
- అన్ని రంగాల్లో మహిళలదే పైచేయి
- అయినా అక్కడక్కడా వివక్ష
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

సాహో.. సబల..!

ఆకాశంలో సగం.. అన్నింటా సగం అన్నట్లుగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పట్టు దలే ఆయుధమై సత్తా చాటుతున్నారు. ఇంతింతై ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారు. అందరికీ ఆదర్శం గా నిలిచి.. మహిళ అంటే అబల కాదు.. సబల అని నిరూపి స్తున్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు పురోగమిస్తూ అద్భుత విజయాలను సాధిస్తున్నారు. అత్యున్నత శిఖరాలను చేరుకుంటూ ఔరా అనిపిస్తున్నారు. విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక రంగాల్లో మహిళల ప్రాధాన్యం గణనీయంగా పెరుగుతోంది. డిజిటలైజేషన్, సోషల్ మీడియా, సాఫ్ట్‌వేర్ దిగ్గజ సంస్థల్లో ఎందరో మహిళలు ప్రతిభా పాటవాలు చాటుతున్నారు. ఇదంతా నాణేనికి ఒక వైపు మాత్రమే. మరో వైపు అన్ని రంగాల్లోనూ మహిళలపై వివక్ష కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ ఇంటా, బయటా అణచివేతకు గురవుతున్నారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, కష్టాలు అడ్డొచ్చినా ధైర్యంగా నిలుస్తూ అభాగ్యులకు ధైర్యాన్ని నూరిపోస్తున్నారు. కొందరు మహిళలు. అకుంఠిత దీక్షతో అపూర్వ విజయాలు సాధించి.. స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

అనాథల అమ్మ

- మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవలు
- జ్యోతి అనాథాశ్రమం నెలకొల్పిన ముత్తు లక్ష్మి
- 200 మంది అనాథ పిల్లలను చేరదీసిన ఆదర్శమూర్తి



అనాథ శిశువుతో ముత్తులక్ష్మి

మంత్రాలయం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ముత్తులక్ష్మమ్మ పేరు చెబితే అనాథలే గుర్తుకు వస్తారు. అనాథ చిన్నపిల్లల కోసమే తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయురాలు ఆమె. మంత్రాలయం మండలంలోని కాచాపురం గ్రామంలో అనాథ జ్యోతి ఆశ్రమం నిర్వహిస్తున్నారు. ఒక్క అనాథతో ప్రారంభమైన జ్యోతి ఆశ్రమం ఆ తరువాత 200 మందికి ఆశ్రయం ఇచ్చారు. ఊరు పేరు తెలియని చిన్నారులను చేరదీసి పెంచి పెద్ద చేసి ప్రయోజకులుగా చేస్తున్నారు. ఆమె పెళ్లి చేసుకోకున్నా ఎంతో మందికి పెళ్లిళ్లు చేశారు. వారికి పురుడు పోసి వారికి పుట్టిన పిల్లలను సైతం తన ఆశ్రమంలోనే చోటు కల్పించారు. ఆంజనేయ, మారెమ్మ దంపతులు ముంబైకి వలస వెళ్లడంతో అక్కడే 1949లో మూడో సంతానంగా ముత్తులక్ష్మి జన్మించారు. తొమ్మిదేళ్ల వయస్సులో ముంబైలోని ఆంధ్ర కింగ్స్ సర్కిల్ స్కూలుకు వచ్చిన మదర్ థెరిస్సాను చూసి ఆమె ఆదర్శంగా తీసుకున్నారు. 1969లో తన సొంత గ్రామమైన ఖగ్గలుకు వచ్చి తనకున్న 2.40 ఎకరాల్లో.. 40 సెంట్లలో అనాథాశ్రమం స్థాపించారు. రెండెకరాల్లో పండించిన పంటలతో పిల్లలను పోషిస్తున్నారు. 1981లో జ్యోతి ఆశ్రమాన్ని స్థాపించి 76 ఏళ్ల ముత్తులక్ష్మి 44 ఏళ్లుగా 32 పెళ్లిళ్లు చేసి 200 మందిని పెంచి పెద్ద చేశారు. ప్రస్తుతం 35 మంది విద్యార్థులతోపాటు వృద్ధులు, వితంతువులు, మానసిక వికలాంగులు, ఇక్కడ ఆశ్రయం పొందుతున్నారు.

ఆదర్శమూర్తి

- పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దిన లక్ష్మమ్మ
- ఓ కుమారుడు ఐఏఎస్
- మరో కుమారుడు ఏపీఎస్‌పీడీసీఎల్‌లో ఈఈ
- కుమార్తె ఎల్ఐసీలో ఏఏవో



అవుకు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తున్నప్పుడు కొన్ని అపజయాలు ఎదురవుతాయి. అవి అపజయాలు కాదని, అనుభవాలు అని తెలుసుకున్న వారు అనుకున్నది సాధిస్తారు. ఒక్కో ఓటమిని గెలుపునకు మెట్టుగా మార్చుకొని ఎదుగుతారు. సమాజ నిర్మాణంలో భాగస్వాములవుతారు. ఈ కోవకు చెందిన మహిళే నంద్యాల జిల్లా అవుకు పట్టణానికి చెందిన లక్ష్మమ్మ. నిరుపేద గిరిజన కుటుంబంలో జన్మించి అట్టడుగు స్థాయి నుంచి అంచలంచెలుగా ఎదిగారు. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్ది నారీ లోకానికి ఆదర్శంగా నిలిచారు. అవుకు మండలంలోని సీతమ్మ తండాకు చెందిన దాసన్న, సుబ్బమ్మ దంపతుల కూతురు లక్ష్మమ్మ. వీరు సీతమ్మ తండా నుంచి 60 సంత్సరాల క్రితం అవుకుకు వచ్చి స్థిరపడ్డారు. ఆవులను కాసుకుంటూ వాటికి వచ్చే రోగాలకు నాటు వైద్యం చేస్తూ జీవనం సాగించేవారు. కూతురు లక్ష్మమ్మకు చదువుపై ఉన్న ఆసక్తిని గమనించి అప్పట్లోనే 10వ తరగతి వరకు చదివించారు. 1965లో లక్ష్మమ్మకు గడివేముల మండలం లక్ష్మయ్యకుంట తండా (ఎల్‌కే తండా)కు చెందిన రాముడితో వివాహం జరిగింది. వీరికి సౌభాగ్య శిరోమణి బాయి, హరిశే వియా నాయక్, తిరుమలనాయక్ సంతానం. ఏఎన్ఎంగా విధుల్లో చేరి : లక్ష్మమ్మ 1970లో ప్యాపిలి మండలం జలదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంగా నెలకు రూ.188 వేతనంతో ఉద్యోగంలో చేరింది. 1982లో పదోన్నతి పొంది ఉయ్యాలవాడ పీహెచ్‌సీలో హెల్త్‌సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తించారు. 2002లో పదోన్నతిపై కడప జిల్లా వద్దిరాల పీహెచ్‌సీలో పీహెచ్ఎన్‌గా పని చేశారు. 2007లో ఉద్యోగం నుంచి రిటైర్ అయ్యారు. దాదాపు 37 సంవత్సరాల పాటు గర్భిణులకు ప్రసవ సమయాల్లో వైద్యసేవలు అందించారు. భర్త రాముడు పిల్లల భవిష్యత్‌ను పట్టించుకోకపోయినా లక్ష్మమ్మ మొక్కవోని ధైర్యంతో కష్టపడి పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసింది. మొదటి సంతానమైన కుమార్తె సౌభాగ్య శిరోమణిబాయి అనంతపురం జిల్లా ధర్మవరం పట్టణంలోని ఎల్ఐసీ ఆఫీసులో ఏఏఓగా, రెండో కుమారుడు హరిశే వియా నాయక్ కడపలో ఏపీఎస్‌పీడీసీఎల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా, మూడో కుమారుడు తిరుమలనాయక్ ఒడిశా రాష్ట్రంలో ఐఏఎస్‌గా అధికారిగా పని చేస్తున్నారు. భువనేశ్వర్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు.

మదిలో మెదిలిన కలలే నిజమాయే...

తన కలలు నిజమయ్యాయని లక్ష్మమ్మ ఆనందం వ్యక్తం చేశారు. ప్రతి మనిషి విజయం వెనుక తల్లిగా, భార్యగా మహిళ ఉంటుందని ఆమె అంటారు. లక్ష్మమ్మ తన పిల్లల విజయానికి జీవితమంతా కృషి చేశారు. ఓవైపు ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తూ మరో వైపు కుటుంబాన్ని పోషించుకుంటూ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దారు. విధి నిర్వహణలో ప్రజలకు సేవ చేస్తూనే తన పిల్లలకు మంచి భవిష్యత్‌ను అందించి ఇంటా బయట గుర్తింపు తెచ్చుకున్నారు.



రిటైర్‌మెంట్ సన్మాన సభలో తల్లి లక్ష్మమ్మను సన్మానిస్తున్న కుమారుడు తిరుమలనాయక్ (ఫైల్)

స్త్రీలు శక్తిసంపన్నులు : కలెక్టర్



నంద్యాల నూనెపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జన్మతః మహిళలు శక్తిమంతులని కలెక్టర్ రాజకుమారి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో ఆమె జిల్లా మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు ఉన్నత వ్యక్తిత్వంతోపాటు ఆత్మాభిమానం కలిగి ఉంటారని కుటుంబ బాధ్యతలతోపాటు ఉద్యోగ, వ్యాపార, రాజకీయ, ఇతర రంగాల్లో స్థిరపడాలన్నా, విజయాలు సాధించడంలో మహిళల కష్టం స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో స్థిరపడిన మహిళా పారిశ్రామికవేత్తలు పది మందికి ఉపాధి కల్పించే రీతిలో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. నేటి తరం పిల్లలకు మంచి భవిష్యత్ అందించాల్సిన బాధ్యత కూడా మహిళలపైనే ఉందన్నారు. మగ, ఆడ పిల్ల తారతమ్యలేకుండా సమాన స్థాయిలో పెంచి ఉత్తమ పౌరులుగా దేశ, రాష్ట్ర భవిష్యత్‌లో చక్కటి భాగస్వామ్యం పంచాలని సూచించారు. లింగ వ్యవస్థపై చట్టాలున్నప్పటికీ నిరాశ్రయులైన అనాథపిల్లలకు సమగ్ర శిశు సంరక్షణ కేంద్రాలున్నాయని తెలిపారు.



స్త్రీలు చదువుకుంటే కుటుంబంలో, సమాజంలో ఉన్న చీకట్లు తొలగిపోతాయి.

- సావిత్రిబాయి పూలే

ఆదోని ఆణిముత్యం

భారత క్రికెట్ మహిళా జట్టులో అంజలి శార్వాణి



బ్యాటింగ్ చేస్తున్న క్రికెటర్ అంజలి శార్వాణి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్ల తలచుకుంటే ఏ రంగంలోనైనా దూసుకుపోగలదని నిరూపించింది. పట్టుదలతో శ్రమిస్తే లక్ష్యాన్ని సాధించగలరని చాటి చెప్పింది. భారత మహిళా క్రికెట్ జట్టుకు ఎంపికైన తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకుంది. క్రికెట్ ఆల్ రౌండర్ రాణిస్తూ ఎంతో మంది యువతకు స్ఫూర్తిగా నిలిచింది. భారత జట్టు క్రికెటర్ ఆదోని ఆణిముత్యం కేశవరాజు గారి అంజలి శార్వాణిపై మహిళ దినోత్సవం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

● అథ్లెటిక్ నుంచి క్రికెటర్‌గా

ఆదోని పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు రమణ, అనూరాధ దంపతుల కూతురు అంజలి శార్వాణి పాఠశాల స్థాయి నుంచి అథ్లెటిక్‌పై శ్రద్ధ చూపేవారు క్రమంగా క్రికెట్ వైపు అడుగులు వేశారు. తల్లిదండ్రులు తన తొలి గురువు వెంకటేష్ ప్రోత్సాహంతో క్రికెట్లో రాణిస్తూ జిల్లా, రాష్ట్ర, సౌత్ ఇండియా, జాతీయ క్రికెట్ స్థాయిలో రాణిస్తూ తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది. సౌత్ ఇండియా అండర్-19 జట్టు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఆ పోటీలో ఆల్ ఇండియా చాంపియన్‌షిప్ సాధించారు. ఇండియా మహిళా క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాలని సంకల్పంతో సాధన చేశారు. అలా అవకాశాన్ని అందిపుచ్చుకొని బాంగ్లాదేశ్, శ్రీలంకతో జరిగిన టెస్ట్ మ్యాచ్ ఆడి తానేంటో నిరూపించుకుంది. ప్రస్తుతం తాను మహిళా యూపీ వారియర్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఆల్ రౌండర్‌గా రాణిస్తున్నారు.

● 2009 సౌత్ ఇండియా అండర్-16 ఆంధ్ర జట్టుకు అంజలి శార్వాణి ప్రాతినిధ్యం వహించారు. ఆ ఏడాది జట్టు చాంపియన్ షిప్ సాధించింది.

● 2015లో సౌత్ ఇండియా అండర్-19 జట్టుకు తొలిసారిగా ఎంపికై కెప్టెన్‌గా వ్యవహరించారు.

● 2018లో అండర్-23 చాలెంజర్ ట్రోఫీ కైవసం చేసుకున్నారు. భారత గ్రీన్ టీం ఎంపిక సౌత్ ఇండియా వివిధ రాష్ట్రాల అవకాశం దక్కించుకొని ప్రతిభ కనబరిచింది. ప్రభుత్వం గుర్తించి రైల్వే శాఖలో ఉద్యోగం కల్పించింది. అప్పటి నుంచి రైల్వే క్రికెట్ టీంలో ఆడుతూ తన ప్రతిభను నిరూపించుకుంది. ఆంధ్ర జట్టుకు ప్రాతినిధ్యం కూడా వహించారు. సెంట్రల్‌లో జోన్‌కు జరిగిన మ్యాచ్‌లో చాంపియన్‌షిప్ కైవసం చేసుకుంది. ఏ-టీం తరఫున ప్రాతినిధ్యం వహించి అత్యధికంగా 27 వికెట్లు సాధించి రికార్డ్ నెలకొల్పింది. దీంతో బీసీసీఐ కంట్లో పడడంతో భారత మహిళా జట్టుకు ఎంపికై 2023 డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో తలపడి తనకంటూ గుర్తింపు తెచ్చుకుంది.



అడవికి అండగా ఆమె

- విధి నిర్వహణలో ధైర్య సాహసాలు
- వన, వన్యప్రాణి సంరక్షణలో ఉత్తమ సేవలు
- ఉన్నతాధికారుల నుంచి ప్రశంసా పత్రాలు

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్ మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అటవీ సంరక్షణలో పురుషులతో సమానంగా మహిళలు అడవి తల్లికి అండగా నిలుస్తున్నారు. సహచర ఉద్యోగులతో సమన్వయంగా విధుల్లో చక్కగా రాణిస్తున్నారు. కర్నూలు నగరానికి చెందిన రేణుక వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. కష్టపడి చదివి అటవీ శాఖలో 2011లో ఫారెస్టు బీట్ అధికారిగా నియమితులయ్యారు. అక్రమాలకు అడ్డుకట్ట వేసే క్రమంలో ఈమె ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. ఈ క్రమంలో అక్రమార్కుల నుంచి భౌతిక దాడులు సైతం జరిగాయి. ఒంటరిగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆమెపై కారం పొడి చల్లి దాడి చేసినా రేణుక చలించలేదు. యెనగండ్లలో అరుదైన తాబేళ్లను అక్రమంగా తరలిస్తున్న వారిని మఫ్టీలో వెళ్లి పట్టుకున్నారు. ఇందుకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేకమైన ప్రశంసాపత్రం రూ.1000 రివార్డు అందుకోనునున్నారు. అలాగే శకుంతల అనే మరో మహిళ 2011లో ఫారెస్టు బీట్ అధికారిగా అటవీశాఖలోకి ప్రవేశించారు. వన్యప్రాణి సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. అర్ధరాత్రుల్లో ప్రమాదాలకు గురైన జింకలు, నెమళ్లను పరిరక్షించారు.



రేణుక

● ప్రధానంగా సిద్దనగట్టు రిజర్వు ఫారెస్టులో నాలుగు దశాబ్దాలుగా పరాయి ఆధీనంలో 20 ఎకరాల అటవీ భూమి ఉండేది. దాన్ని ఖాళీ చేయించి అటవీశాఖ స్వాధీనం చేసుకునేలా చేశారు.

● రామళ్లకోట సమీపంలో అటవీ భూములు అన్యాక్రాంతం అవుతుండగా, వాటిని అడ్డుకున్నారు. రాజకీయ బెదిరింపులు, ప్రలోభాలు ఎదురయినా, వాటిని ధైర్యంగా ఎదుర్కొని, ఉన్నతాధికారుల సహకారంతో ఈ పన్నాగానికి అడ్డుకట్ట వేశారు.

● శకుంతల అందించిన ఈ సేవలకు గాను 2025 రిపబ్లిక్ డేను పురస్కరించుకుని కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకున్నారు.



కలెక్టర్ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న శకుంతల

వెలుగులోకి భూ కబ్జాలు

ఆదోని అంటే గుర్తుకొచ్చేది భూ కబ్జాలే. వైసీపీ హయాంలో భూ అక్రమార్కులు పెట్రేగిపోయారు. రెవెన్యూ రికార్డులను మాయ చేశారు. ఒకే భూమిని పలువురు పేరిట అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించారు. అప్పటి కీలక ప్రజాప్రతినిధి అండతో భూ కబ్జాలు పెరిగిపోయాయి. పట్టణంలో అంతర్భాగమైన సాదాపురం పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు 352లో భారీఎత్తున భూ అక్రమాలు జరిగాయి. వీటిని నిగ్గు తేల్చాలంటే వైసీపీ హయాంలో వెలుగు చూసిన భూ ఆక్రమణలు, డబుల్ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ భూ సేకరణలపై సమగ్ర విచారణ చేయించాలని ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి రాష్ట్ర విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే డాణాపురం వద్ద జగనన్న కాలనీ పేరిట జరిగిన భూ సేకరణ కుంభకోణంపై విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే ఫిర్యాదుతో భూ అక్రమార్కుల గుండెల్లో దడ మొదలైంది.

- వైసీపీ హయాంలో అక్రమాలు
- ఆదోనిలో ఒకే భూమి పలువురికి రిజిస్ట్రేషన్
- రెవెన్యూ రికార్డులు తారుమారు
- సర్వే నంబరు 352 భూముల్లో అక్రమార్కుల పంజా
- మంత్రులకు ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోనిలో వివాదంగా మారిన సర్వే నంబరు 352లోని భూములు

కర్నూలు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆదోని పట్టణంలో అంతర్భాగమైన సాదాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు.352, మండిగిరి పంచాయతీ పరిధిలోని సర్వే నంబరు.444 కింద ఉన్న భూముల్లో గత వైసీపీ హయాంలో భూ అక్రమార్కులు పెద్దఎత్తున రెవెన్యూ రికార్డులు తారుమారు చేసి భూ ఆక్రమాలు, కబ్జాలకు పాల్పడ్డారు.. సమగ్ర విచారణ చేసి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్‌లకు ఫిర్యాదులు చేశారు. సాదాపురం రెవెన్యూ గ్రామం పరిధిలో సర్వే నంబరు.352లో రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్ ప్రకారం 38.35 ఎకరాలు విస్తీర్ణం చూపిస్తున్నారు. ఆన్‌లైన్ అడంగల్‌లో 52.20 ఎకరాలు చూపిస్తోంది. రీ-సెటిల్‌మెంట్ రిజిస్టర్‌ను కాదని 15.82 ఎకరాలు భూమి అదనంగా ఎలా వచ్చింది..? అలాగే మండిగిరి పంచాయతీ పరిధిలో సర్వే నంబరు.444 కింద రీ-సెటిల్‌మెంట్ రిజిస్ట్రేషన్ (ఆర్ఓఆర్) రికార్డుల ప్రకారం 53.58 ఎకరాల భూ విస్తీర్ణం చూపిస్తే.. ఆన్‌లైన్ అడంగల్‌లో 79.5 ఎకరాలు చూపిస్తుంది. 25.92 ఎకరాలు భూమి ఆన్‌లైన్‌లో అదనంగా ఎలా వచ్చింది..? అన్నది వైసీపీ హయాంలో పని చేసిన రెవెన్యూ అధికారులకు తెలియాలి. ఇక్కడ ఎకరం రూ.10-15 కోట్లకు పైగా పలుకుతుంది. డబుల్ రిజిస్ట్రేషన్లు, మిస్సింగ్ రిజిస్ట్రేషన్లు, క్రయ విక్రయాల వివరాలు తారుమారు చేసినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ల్యాండ్ కన్వర్షన్, ఎన్‌ఏ చేసిన రికార్డులు లేవని, ఇప్పటికీ భూమిని లే-అవుట్లు వేసి స్థిరాస్తి వ్యాపారాలు, నిర్మాణాలు చేస్తున్నారని వివరించారు. అంతేకాదు సర్వే నంబరు.352లో తమకున్న ఎకరం భూమి ఆక్రమించారని, న్యాయం చేయాలని కోరుతూ బాధితులు అయ్యప్ప, ఎం.నరసింహులు జాతీయ సెడ్యూల్ కులాల కమిషన్‌లో ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు.

● ఏ ఒక్కరినీ వదలిపెట్టం



విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే పీవీ పార్థసారథి

వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారాన్ని అడ్డు పెట్టుకొని వ్యవస్థీకృత భూ అక్రమాలకు పాల్పడ్డారు. నేను ఎమ్మెల్యేగా ఏ వీధికి వెళ్లినా సర్వే నంబరు.352 బాధితులు ఏకరువు పెడుతున్నారు. 352, 444 సర్వే నంబర్లలో జరిగిన భూ అక్రమాలు, రికార్డుల తారుమారు, కబ్జాలపై విచారణ చేయాలని మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్‌లకు ఫిర్యాదు చేశాను. డాణాపురం వద్ద జగనన్న కాలనీ కోసం తీసుకున్న భూ సేకరణలో భారీ అక్రమాలు జరిగాయి. వైసీపీ నాయకులు పక్కా ప్రణాళికతో రైతులతో తక్కువ ధరకు భూములు మాట్లాడుకొని.. ప్రభుత్వానికి ఎక్కువ రేట్లకు ఇచ్చి ఇటు రైతులు, అటు ప్రభుత్వాన్ని మోసం చేశారు. భూ అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టే ప్రసక్తి లేదు.

\- పార్థసారథి, ఆదోని ఎమ్మెల్యే

సచివాలయ ఉద్యోగులకు నేడు శిక్షణ

కర్నూలు న్యూసిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్వామిత్వ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా శనివారం జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో శిక్షణ ఇవ్వనున్నట్లు కర్నూలు డివిజనల్ పంచయతీ అధికారి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్‌లో పైలట్ ప్రాజెక్టు కింద ఎన్నుకున్న ఏడు మండలాల్లో ఒక్కో గ్రామపంచాయతీ నుంచి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు(4), డిజిటల్ అసిస్టెంట్లు(3) పంచాయతీ కార్యదర్శులు(3) శిక్షణకు హాజరు కావాలన్నారు. సర్వే జరిగే ప్రక్రియ సంబంధిత గ్రామ సర్వేయర్‌తో కలిసి రోవర్ ఆపరేషన్, పాయింట్లు పికప్, అసైనింగ్ చలానా నెంబరు 36 కాలమ్ డేటాను సేకరించాలన్నారు. సి.బెళగల్(సి.బెళగల్), చనుగొండ్ల(గూడూరు మండలం), పర్ల(కల్లూరు), ఎర్రదొడ్డి(కోడుమూరు), ఈ.తాండ్రపాడు(కర్నూలు), మీదివేముల(ఓర్వకల్లు), గోవర్ధనగిరి(వెల్దుర్తి)ని ఎంపిక చేసినట్లు తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే శాఖ అధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ ఉంటుందన్నారు.

16న జడ్పీ సర్వసభ్య సమావేశం

కర్నూలు న్యూసిటీ, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం ఈ నెల 16న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ సీఈవో జి.నాసరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ సమావేశ భవనంలో ఉదయం 11 గంటలకు ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు, అధికారులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ, బడ్జెట్-జడ్‌పీపీ అండ్ ఎంపీపీ 2025-26లపై చర్చ ఉంటుందని చెప్పారు. సమావేశానికి ఉమ్మడి జిల్లాల జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పత్తికొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆటోను మోటార్‌సైకిల్ ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. అనంతపురం జిల్లా వజ్రకరూర్ సమీపంలో వెంకటాంపల్లి తండాకు చెందిన రాజూనాయక్, రామూనాయక్, బీమూనాయక్ బంధువు మృతిచెందడంతో శుక్రవారం పత్తికొండ మండలపరిధిలోని పెండ్లిమాన్ తాండాకు మోటార్‌సైకిల్‌పై వచ్చారు. కార్యక్రమం ముగించుకుని రాత్రి తిరిగి వెంకటాంపల్లి తండాకు మోటార్‌సైకిల్‌పై బయలుదేరారు. పత్తికొండ చెరువుసమీపంలో కొలాయిబావివద్ద ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 అంబులెన్స్‌లో పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

600 సెల్‌ఫోన్లు రికవరీ

● బాధితులకు అప్పగింత



బాధితులకు మొబైల్ ఫోన్లు అందజేస్తున్న ఎస్పీ

కర్నూలు క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెరేడ్ మైదానంలో మొబైల్ రికవరీ మేళాను శుక్రవారం నిర్వహించారు. ఈ మేళాకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ పాల్గొని బాధితులకు రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను అందజేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.1.20 కోటి విలువ చేసే 600 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామన్నారు. ప్రజలు రైల్వే స్టేషన్లు, జాతరలు, పాఠశాలలు, కళాశాలల్లో తమ మొబైల్ ఫోన్లను పోగొట్టుకుంటున్నారన్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, చెన్నై, హైదరాబాద్ పలు జిల్లాల నుంచి రికవరి చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్క పోలీసును, ల్యాబ్ పోలీసులను అభినందించారు. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్లు మన జీవితంలో ఒక భాగంగా ఉందన్నారు. ప్రతి రోజు ప్రతి పనిలో మొబైల్ ఉపయోగం ఉంటుందన్నారు. ఫోన్‌కు సంబంధించిన పర్సనల్ వివరాలు, ఫోన్ నెంబర్లు, వ్యాపార లావాదేవీలు, అటాచ్‌మెంట్స్, సెంటిమెంట్స్, ఆన్‌లైన్ బ్యాంకు ఖాతా వ్యవహారాలు ఇలా చాలా మిస్ అవుతుంటాయన్నారు. ఎవరైనా తమ ఫోన్ పోగొట్టుకుంటే వెంటనే కర్నూలు వెబ్‌సైట్ Http://kurnool police.in/mobilethef వెళ్లి పోగొట్టుకున్న మొబైల్ ఐఎంఈఐ వివరాలు తెలియజేస్తే సెల్‌ఫోన్ రికవరీ చేసేందుకు పోలీసులు కృషి చేస్తారన్నారు. ఈ-పోలీస్ సేవకు ఎలాంటి రుసుం చెల్లించకుండా ఉచితం అని చెప్పారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుశేన్‌పీరా, డీఎస్పీ బాబు ప్రసాద్, ఏఆర్ డీఎస్పీ భాస్కర్ రావు, సీఐలు తేజామూర్తి, అబ్దుల్‌గౌస్, రామయ్య నాయుడు, నాగరాజారావు, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, టెక్నీషియన్ బృందాల సభ్యులు పాల్గొన్నారు.

పాముకాటుతో వ్యక్తి మృతి

వెల్దుర్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి పాముకాటుకు గురై మృతి చెందాడు. మండలంలో లక్ష్మంపల్లె గ్రామానికి చెందిన బోయ రామాంజనేయులు(46) శుక్రవారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన సమయంలో పాము కాటువేసింది. ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు తెలిపాడు. కుటుంబ సభ్యులు స్థానికుల సహాయంతో ఆటోలో వెల్దుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మార్గమధ్యంలో చనిపోయినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించారు. భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సూదేపల్లెలో అగ్ని ప్రమాదం

వెల్దుర్తి, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూదేపల్లెలో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగి రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. ఉన్నపలంగా మంటలు చెలరేగి రమణారెడ్డి, పుల్లారెడ్డి, భూమిరెడ్డి పొలాలకు వ్యాపించాయి. అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అంతలోపు రైతులు మంటలార్పే ప్రయత్నం చేశారు. రమణారెడ్డి పొలంలోని మునగపంట, డ్రిప్ పరికరాలు, మోటార్లు, స్టార్టర్ బాక్సులు అగ్నికి ఆహుతయ్యాయి. పుల్లారెడ్డి, భూమిరెడ్డి పొలంలో ఉన్న సొప్ప వాము, వరిగడ్డి వాము, రెండు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ వైర్లు కాలిపోయాయి. రూ.3 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు.

పని భారం తగ్గించాలి

- యూఎఫ్‌బీయూ జిల్లా కన్వీనర్ నాగరాజు
- ఈ నెల 24, 25 దేశవ్యాప్త సమ్మెకు పిలుపు



యూబీఐ ముందు ధర్నా చేస్తున్న వివిధ బ్యాంకుల ఉద్యోగులు

కర్నూలు కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పదేళ్లుగా బ్యాంకులో ఏర్పడిన లక్ష ఉద్యోగ ఖాళీలను తక్షణం ఉద్యోగ నియామకాలు చేపట్టి, బ్యాంకుల్లో అధికారులు, సిబ్బందికి పని భారం తగ్గించాలని యూఎఫ్‌బీయూ (యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్) జిల్లా కన్వీనర్ ఇ.నాగరాజు కోరారు. నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లోని యూబీఐ, బుధవారపేట శాఖ కార్యాలయం ఎదుట శుక్రవారం వివిధ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు నిరసన ధర్నా చేపట్టారు. బ్యాంకుల్లో పనిభారం తగ్గించేందుకు, ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేసేందుకు, బ్యాంకు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 24, 25 తేదీలలో దేశవ్యాప్త సమ్మెకు యూనియన్ల నాయకులు పిలుపునిచ్చారు. నాగరాజు మాట్లాడుతూ వారానికి 5 రోజుల పనిదినాలు కల్పించాలని, తాత్కాలిక ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, అవేట్ సోర్సింగ్ ఉద్యోగాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఐబీఏతో చేసుకున్న ఒప్పందం ప్రకారం మిగిలిన బ్యాంకు ఉద్యోగుల కోరికలను నెరవేర్చాలని, కేంద్ర ప్రభుత్వ విధానంలాగే గ్రాట్యూటీ రూ.25 లక్షలు పెంచి, ఇన్‌కమ్ ట్యాక్ రాయితీ ఇవ్వాలని, బ్యాంకు ఉద్యోగులపై జరుగుతున్న దాడుల నివారణకు బ్యాంకు యాజమాన్యాలు, కేంద్ర ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకొని, ఉద్యోగులకు భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ నాయకులు శివకృష్ణ, ఎల్లయ్య, కృష్ణ మోహన్, ఏఐబీవోసీ నాయకులు మురళీకృష్ణ, ఎన్‌సీబీఈ నాయకులు విద్యాసాగర్, ప్రవీణ్, శ్రీకాంత్, ఏపీజీబీ యూనియన్ నాయకులు పాల్గొని ప్రసంగించారు.

పట్టపగలే చోరీ

● దొంగను పట్టుకొని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసిన స్థానికులు



చెట్టుకు కట్టేసిన దొంగను విడిపిస్తున్న పోలీసు



దొంగ చేతిలో బంగారు ఆభరణాలు

ఆదోని, ఆదోని రూరల్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి) : ఓ ఇంట్లో దొంగతనం చేసి పారిపోతున్న దొంగను స్థానికులు పట్టుకొని చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ఆదోని పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో శుక్రవారం పట్టపగలు జరిగింది. స్థానిక మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్‌గా పత్తి వ్యాపారం చేస్తూ, ఆదోని పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న గూళ్యం రమేష్, కుటుంబ సభ్యులు ఉదయం 11 గంటల తర్వాత ఇంటికి తాళం వేసి ఆస్పత్రికి బయల్దేరారు. ఇది గమనించిన ఆదోని పట్టణం ఎల్‌బీ స్ట్రీట్‌కు చెందిన ఖాజామొహినుద్దీన్ అనే వ్యక్తి ఇంటికి ఉన్న తాళాన్ని పెకలించి లోపలికి వెళ్లాడు. ఇంట్లో ఉన్న బీరువాను పగులగొట్టి 7తులాల బంగారు, 9 తులాల వెండి ఆభరణాలను దొంగలించాడు. దొంగ ఇంట్లో ఉండగానే అదే సమయంలో ఆసుపత్రికెళ్ళిన రమేష్ కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటం గమనించి అవాక్కయ్యారు. ఇంతలో లోపల ఉన్న దొంగ ఇంట్లోంచి ఒక ఉదుటన బయటకు పరుగు తీశాడు. రమేష్ కుమారుడు కార్తీక్ దొంగ దొంగ అని గట్టిగా కేకలు వేయడంతో కాలనీవాసులు దొంగను వెంబడించి పట్టుకొని తాడుతో చెట్టుకు కట్టేసి దేహశుద్ధి చేశాడు. దొంగ దగ్గర ఆభరణాలు కనిపించాయి. అనంతరం స్థానికులు తాలుక పోలీసులకు దొంగను అప్పగించారు. అయితే ఎస్ఐ రామాంజనేయులు మాట్లాడుతూ తమ దగ్గరికి దొంగతనం కేసు రాలేదని, దొంగను ఎవరూ అప్పగించలేదని సమాధానం ఇచ్చారు. ఈ విషయంపై సీఐ నల్లప్పను ఆంధ్రజ్యోతి పలకరించగా దొంగను కాలనీ వాసులు పట్టుకొని తమకు అప్పగించిన మాట వాస్తవమేనని, రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని వివరణ ఇచ్చారు.

డిప్యుటేషన్ డ్యూటీ..!

- రుద్రవరం వదిలి చాగలమర్రిలో విధులు
- అక్కడ ఒకేషనల్ టీచర్ ఉన్నా నియామకం
- ఐదేళ్లుగా రెగ్యులర్ స్థానం ఖాళీ



నంద్యాల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వశిక్షా అభియాన్ పరిధిలోని ఓ కేజీబీవీలో పని చేస్తున్న ఒకేషనల్ టీచర్ ప్రజాప్రతినిధుల అండదండలతో డిప్యుటేషన్ పొందారు. ఒకటి కాదు.. రెండు కాదు.. ఏకంగా ఐదేళ్లకు పైగా డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ రెగ్యులర్ టీచర్ ఉన్నప్పటికీ సదరు ఒకేషనల్ టీచర్ పైరవీలు చేసి డిప్యుటేషన్ తెచ్చుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా సంబంధిత ప్రిన్సిపాల్ ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

● **ఎందుకంత ప్రేమో...**

ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని రుద్రవరం కేజీబీవీలో ఓ ఒకేషనల్ టీచర్ పని చేస్తున్నారు. అయితే సదరు టీచర్ 2017-19, 2021 నుంచి ఇప్పటి వరకు డిప్యుటేషన్‌పై అదే నియోజకవర్గ పరిధిలోని చాగలమర్రి కేజీబీవీలో పని చేస్తున్నారు. చాగలమర్రిలో ఖాళీ లేకపోయినా డిప్యుటేషన్‌పై వచ్చి ఏళ్ల తరబడి పని చేస్తుండటం విస్మయం కలిగిస్తోంది. రుద్రవరం కేజీబీవీలో మాత్రం ఒకేషనల్ టీచర్ లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. పోని చాగలమర్రిలో పని చేస్తున్న టీచర్‌నైనా రుద్రవరానికి మార్చారా అంటే అదీ లేదు.

● **ప్రిన్సిపాల్ ఫిర్యాదుతో వెలుగులోకి...**

తమ కేజీబీవీకి నియమించిన ఒకేషనల్ టీచర్ ఏళ్ల తరబడి డిప్యుటేషన్ రూపంలో మరోచోట పని చేస్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందికరంగా మారిందని ప్రిన్సిపాల్ ఇటీవల ఏపీసీకి ఫిర్యాదు చేశారు. సదరు టీచర్ డిప్యుటేషన్ రద్దు చేసి ఇక్కడికి కేటాయించాలని, లేకపోతే మరొకరినైనా నియమించాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు ఆ మేరకు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి మరి.

● **ఫిర్యాదు వచ్చిన విషయం వాస్తవమే..**



కేజీబీవీ ఒకేషనల్ టీచర్ విషయమై ఫిర్యాదు చేసిన విషయం వాస్తవమే. ఈ మేరకు విచారణ చేస్తున్నాం. త్వరలోనే సదరు కేజీబీవీకి టీచర్‌ను కేటాయించి విద్యార్థులకు న్యాయం చేస్తాం. ఇతరత్రా అంశాలపై ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు చర్యలు తీసుకుంటాం.

\- ప్రేమంత్‌కుమార్, ఏపీసీ, సమగ్ర శిక్ష

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● అధికారుల పిలుపు
● మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలల్లో వేడుకలు


పాములపాడు తహసీల్దార్ కార్యాలయంలో వేడుకలు


వెలుగోడులో మహిళా సిబ్బందికి మెమెంటోలు అందజేసిన ఏవో


జూపాడుబంగ్లా వెలుగు కార్యాలయంలో..

నంద్యాల ఎడ్యుకేషన్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా రవాణాశాఖ అధికారిణి ఐశ్వర్యారెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల శ్రీ రామకృష్ణా డిగ్రీ కళాశాలలో మహిళా దినోత్సవాన్ని చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ ప్రగతిరెడ్డి, హేమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

● నంద్యాల శ్రీ సంకల్ప్ పాఠశాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. చైర్మన్ సుధాకర్, కరస్పాండెంట్ రమ్యారెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థుల మాతృమూర్తులకు ఘనంగా స్వాగతం పలికి వారికి వివిధ పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయినులను సత్కరించారు.

నందికొట్కూరు: పట్టణంలోని కోటా వీధిలోని ఎంపీపీ పాఠశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ బేబి, ఎంఈవో సుభాన్ ముఖ్య అతిథుగా హాజరయ్యారు. ఉపాధ్యాయునులకు నిర్వహించిన ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఉత్తమ సేవలు అందిస్తున్న ఉపాధ్యాయినలుఉ శోభారాణి, మహబూబ్‌బీ, ఆశీర్వాదమ్మ, మేరీ ప్రసూనం, రాజేశ్వరిదేవి, నాగమణిని గౌరీశ్వర్ నాయుడు సన్మానించారు. హెచ్‌ఎం నరహరిదాసు, విశ్రాంత ఎంఈవోలు జీవి రంగారెడ్డి, ఆంజనేయులు, విశ్రాంత అధ్యాపకులు వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడు తహసీల్దార్ కార్యలయంలో మహిళా దినోత్సవాన్ని తహశీల్దార్ సుభద్రమ్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సర్వే డిప్యూటీ తహసీల్దార్ సుప్రియ, మహిళా సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. డీటీ పఠాన్‌బాబు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా వెలుగు కార్యాలయంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వెలుగు కార్యాలయంలో కేకులు కట్ చేశారు. ఏపీఎం అంబమ్మ, ఏపీవో గౌరి బాయి. హౌసింగ్ ఏఈ జ్యోతి, మండల సమాఖ్య పొదుపు సంఘం మహిళలు పాలొన్నారు.

వెలుగోడు: వెలుగోడు వ్యవసాయశాఖ కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సిబ్బందికి మెమెంటోలు అందించి సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఏవో పవన్, ఎఈవోలు సుధారాణి, అంజిత్ కుమార్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


నందికొట్కూరులో..



నంద్యాలలోని శ్రీ సంకల్ప్ పాఠశాలలో..

'తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి'


మిడుతూరులో ఎస్ఎస్ ట్యాంకును పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో

నందికొట్కూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి మిడ్తూరు, నందికొట్కూరు ఎంపీడీవోను ఆదేశించారు. పట్టణంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను శుక్రవారం పరిశీలించి మండలం లోని సీపీడబ్ల్యూఎస్ స్కీం అమలు తీరును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేసీ కాలువ నుంచి పట్టణంలోని సమ్మర్ స్టోరేజీ ట్యాంక్‌ను నింపాలని ఆదేశించారు. ఎంపీడీవో సుబ్రమణ్యం శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసరెడ్డి, ఏఈ వేణుమాధురి, ఈవోఆర్డీ రంగనాయక్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మిడుతూరు: మిడుతూరు సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును కర్నూలు జడ్పీ సీఈవో నాసరరెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వివరాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో దశరథరామయ్య, ఈవోఆర్డీ సంజన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విశ్వనాథం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

10న నిరసన ర్యాలీ

నంద్యాల కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు నంద్యాల జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు బుగ్గన చంద్రమౌళీశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం టెక్కలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయలో విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రమౌళీశ్వరరెడ్డి మాట్లాడుతూ రాయచోటిలో హిందువులపై మతోన్మాదులు చేసిన దాడులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు శేషసాయి, సహ కార్యదర్శులు నాగరాజు, విశ్వనాథరెడ్డి, ప్రకండ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కూచిపూడి నాట్యంపై అవగాహన

నంద్యాల కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నృత్య ప్రదర్శనలోని 108 కర్ణాలు(భంగిమలు)పై శుక్రవారం నాట్యగురువు పల్లంశెట్టి సురేష్ అవగాహన సదస్సు నిర్వహించారు. నంద్యాల ఎస్‌బీఐ కాలనీలో నంది ఫైన్ ఆర్ట్స్, ఆర్టిస్ట్స్ డెవలెప్‌మెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సురేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. అవగాహన అనంతరం కూచిపూడి నాట్యంలో శిక్షణ ఉంటుందన్నారు.

'పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి'

నంద్యాల రూరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛతే మన లక్ష్యమని.. మన మందరం చేద్దామని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని డీపీవో జమీవుల్లా పిలుపునిచ్చారు. నంద్యాల మండలంలోని పాండురంగాపురం గ్రామంలో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల పరిదిలోని సర్పంచ్‌లకు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో సుగుణశ్రీ, ఈవోఆర్డీ, ఎన్‌ఐఆర్పీ నాగేశ్వరరావు, సర్పంచ్‌లు రాజు, ఓబులేసు, నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పురుగు మందుల దుకాణాల తనిఖీ

నందికొట్కూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురుగుల మందు దుకాణాలను జోన్‌కు చెందిన ఏడీఏఆర్ అశోక్ వర్ధన్ రెడ్డి నందికొట్కూరులో ఆకస్మికంగా తనిఖీ చేశారు. శుక్రవారం పట్టణంలోని సింహాద్రి ఫెర్టిలైజర్స్, శ్రీ లక్ష్మీవెంకటేశ్వర ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, న్యూ సుధాకర్‌రెడ్డి ఫర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణాలను వ్యవసాయశాఖ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో జీ 2, జీ 3 ఫారాలను చూపించకపోవడంతో 121 లీటర్ల బయో మందుల స్టాక్ అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఏవో షేక్షావలి ఉన్నారు.

పాఠశాలల్లో పనుల పురోగతిపై సమీక్ష

ఆత్మకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల పరిధిలోని మండలాల్లో పీఎం(ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతిపై సమగ్ర శిక్షా అభియాన్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ప్రేమంత్ కుమార్ సమీక్షించారు. ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ సమీక్షకు ఆయా మండలాల్లోని ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఇంజనీరులు, కాంట్రాక్టలతో మాట్లాడుతూ.. పీఎంశ్రీ పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతి గుర్తించి అడిగి తెలుసుకున్నారు. ఏవైనా వర్క్‌లు మందకొడిగా సాగుతున్నట్లయితే అందుకు గల కారణాలను తెలుసుకుని అక్కడికక్కడే సమస్యను పరిష్కరించారు. నోడల్ ఆఫీసర్ లలిత కుమారి, సెక్టోరల్ ఆఫీసర్ రఘురామిరెడ్డి, ఎంఈవోలు బాలాజీనాయక్, సురేష్ ఉన్నారు.

కొత్తపల్లి: విద్యార్థినులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ (ఏపీసీ) ప్రేమంత్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఆయన కొత్తపల్లి కేజీబీవీని అకడమిక్ మానిటరింగ్ అధికారిణి (ఏఎంసీ) లలితాకుమారి, ఇన్‌చార్జి ఎంఈవో బాలాజి నాయక్, ఎంఈవో-2 ఇనయతుల్లాతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని, విద్యార్థినుల హాజరు శాతాన్ని, పాఠశాల అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎస్‌వో లక్ష్మీబాయి తదితరులు ఉన్నారు.

'రీసర్వే పకడ్బందీగా చేపట్టాలి'

గడివేముల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేను తప్పొప్పులు లేకుండా పకడ్బందీగా చేయాలని తహసీల్దార్ వెంకట రమణ అన్నారు. మండలంలోని కొరపొలూరు గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో దోపిడీ

● స్కాన్ ఫిల్మ్‌లకు ఇష్టానుసారంగా వసూళ్లు
● పలు వ్యాధి నిర్ధారణ పరీక్షలు బయటకే..



నంద్యాల హాస్పిటల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల ప్రభుత్వాసుపత్రిలో స్కానింగ్ చేయించుకోవాలంటే జేబులు నింపనిదే పని జరగడం లేదని రోగులు వాపోతున్నారు. ఆసుపత్రిలో ఓ సంస్థ ఆధ్వర్యంలో ఎంఆర్‌ఐ, సీటీ స్కాన్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఆసుపత్రిలో చేరిన రోగులకు ఉచితంగా స్కానింగ్ చేయాల్సి ఉండగా అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని రోగులు వాపోతున్నారు. అంతేకాకుండా రోగులకు స్కానింగ్‌లకు సంబంధించి ఫిల్మ్‌లను ఇవ్వకుండా కేవలంపై తెల్లకాగితంపై రిపోర్టులు రాసిస్తున్నారు. ఫిల్మ్‌లు అడిగితే రూ.1000 నుంచి రూ.2వేల వరకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని రోగులు చెబుతున్నారు. ఆసుపత్రిలో నెలకు దాదాపు 40 ఎంఆర్‌ఐ, 60కి పైగా సీటీ స్కాన్‌లు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఓ సంస్థకు స్కానింగ్ కాంట్రాక్టును కట్టబెట్టింది. ప్రభుత్వాసుపత్రిలో చికిత్స కోసం వస్తే పరీక్షల నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రులకు పంపుతున్నారని, అలాగే స్కానింగ్ సెంటర్‌లలో పనిచేసే సిబ్బంది రోగుల నుంచి వేలకు వేలు వసూలు చేస్తున్నారని రోగులు ఆరోపిస్తున్నారు.

వెయ్యి రూపాయలు డిమాండ్ చేశారు



రెండు రోజులుగా తలకు తీవ్రమైన గాయం కావడంతో ఆసుపత్రిలో చేరాను. వైద్యులు ఎంఆర్‌ఐ స్కానింగ్ చేయించుకోవాలని సిఫారసు చేశారు. స్కానింగ్ సెంటర్‌కు వెళ్లి స్కానింగ్ తీయించుకుని ఫిల్మ్ అడుగగా తెల్లపేపరు చేతిలో పెట్టారు. ఫిల్మ్ కావాలంటే వెయ్యి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

- మధు, మూలసాగరం, నంద్యాల

రూ.2,500 అడిగారు



ఆసుపత్రిలో సీటీ స్కానింగ్ చేయించుకున్నా. ఫిల్మ్ అడిగితే రూ.2500 డిమాండ్ చేశారు. ఇప్పటికే రూ.1500 చెల్లించాను. మిగిలిన డబ్బు ఫిల్మ్ చేతికి వచ్చిన వెంటనే చెల్లించాలని చెప్పారు.

- అక్బర్‌బాషా, కోవెలకుంట్ల

అధికంగా వసూలు చేస్తే చర్యలు

స్కానింగ్‌కు సంబంధించి ఒక ఫిల్మ్‌కు రూ.200 మాత్రమే వసూలు చేయాలి. అధికంగా వసూలు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ జిలానీ, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

అమ్మవారికి కొబ్బరి కాయల సమర్పణ


కొబ్బరికాయల సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

శ్రీశైలం, మార్చి 7(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మహాక్షేత్రంలో చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళవారం గానీ, శుక్రవారం గానీ భ్రమరాంబ అమ్మవారికి కుంభోత్సవం జరిపించడం సంప్రదాయం. ఇందులో భాగంగా ఈ సంవత్సరం ఏప్రిల్ 13న కుంభోత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారికి సాత్విక బలి నిర్వహించేందుకు కుంభోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమంలో కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. ఈ కుంభోత్సవాన్ని పురస్కరించుకొని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే వచ్చే ప్రతి మంగళవారం, శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పిస్తారు. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరి కాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమతో పూజాధికాలు నిర్వహించి అనంతరం అమ్మవారికి సమర్పించారు.

● శ్రీశైలం మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం శుక్రవారం స్వామి, అమ్మవార్లకు ఊయల సేవ నిర్వహించారు. గ్రామదేవత అంకాలమ్మకు విశేష పూజలు నిర్వహించారు. నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా దేవస్థానం శుక్రవారం సాయంత్రం నందికొట్కూరుకు చెందిన సాయి నృత్యకళాశాల బృందంతో సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది.

'పనుల్లో నాణ్యత పాటించాలి'


ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న అధికారి

పాణ్యం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలు రోజుకు రూ. 300 కూలి అందేలా పని చేయాలని, పనుల్లో నాణ్యత పాటించాలని జిల్లా మానిటరింగ్ అండ్ ఈవాల్యుయేషన్ అధికారి భాస్కరనాయుడు సూచించారు. శుక్రవారం పాణ్యం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఈసీలు, టెక్నికల్ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫారంపాండ్స్ సంఖ్యను పెంచాలన్నారు. కూలీలకు సరైన వసతులు కల్పించాలన్నారు. కూలీల సంఖ్యను మరింత పెంచాలన్నారు. ఉపాధి పనుల ప్రోగ్రెస్ వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వరి గడ్డి ట్రాక్టర్ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు

గడివేముల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామ సమీపంలో శుక్రవారం వరి గడ్డి ట్రాక్టర్ బోల్తాపడటంతో డ్రైవర్ చిన్న సుబ్బరాయుడు గాయపడ్డారు. బండిఆత్మకూరు మండలం బోదనం గ్రామం నుంచి వరి గడ్డిని చిన్న సుబ్బరాయుడు ట్రాక్టర్‌లో తీసుకొని కర్నూలుకు వెళ్తుండగా పెసరవాయి గ్రామ సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడ్డ చిన్న సుబ్బరాయుడును చికిత్స నిమిత్తం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

బ్రేక్ ఫెయిల్ కావడంతో..

ఆత్మకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామ సమీపంలో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆత్మకూరు నుంచి కర్నూలు వైపు పచ్చిమిర్చి లోడుతో గూడ్స్ వాహనం వెళ్తుండగా వెనక నుంచి వాహనం బ్రేక్ ఫెయిల్ కారణంగా ఢీకొట్టింది. మిర్చి లోడుతో వెళ్తున్న వాహనం రోడ్డు పక్కకు దూసుకెళ్లగా, ఢీకొట్టిన వాహనం ముందు భాగం దెబ్బతింది. అయితే ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు విచారిస్తున్నారు.

నేడు జూడో జట్టు ఎంపిక

నంద్యాల హాస్పిటల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో శనివారం జిల్లా జూనియర్ జూడో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల సుధాకర్ తెలిపారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డుతో పాల్గొనాలని తెలిపారు. బాలబాలికలు 15నుంచి 21 సంవత్సరంలోపు ఉండాలని 2005 నుంచి 2010 సంవత్సరం లోపు జన్మించి ఉండాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 15,16వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి జూనియర్ జూడో చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని తెలిపారు.

మహానందిలో పూజలు

మహానంది, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో అనంతపురం జిల్లా పెనుగొండ కు చెందిన కైలాస స్వామి తన శిష్య బృందంతో కలిసి శుక్రవారం ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఆలయం వద్ద వీరికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో మహానందీశ్వరుడికి, కామేశ్వరీదేవి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకార్చనలను స్వామీజీ స్వయంగా భక్తి శ్రద్ధలతో జరిపారు. అనంతరం కల్యాణ మంటపంలో వేదపండితులు ఆశీర్వదించారు. ప్రసాదాలను అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

'విజయవంతం చేయాలి'


పోస్టరును ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆత్మకూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదిన పిఠాపురంలో నిర్వహించనున్న జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాయబ్ కమల్ పిలుపునిచ్చారు. ఆత్మకూరు పట్టణంలోని చక్రంహోటల్ హాల్‌లో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గం నుంచి వేలాదిగా పార్టీ శ్రేణులు, ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ అశోక్, ఉమ్మడి కర్నూలు జిల్లా కమిటీ ప్రచార కో ఆర్డినేటర్ శ్రీరాములు, అడ్వకేట్ అభిమన్యుడు, నాయకులు శేషు, షాలు, హరీష్, అరుణ్, సాయి, హరీష్ తదితరులు ఉన్నారు.

వైభవంగా సహస్ర కలశ క్షీరాభిషేకం

నంద్యాల కల్చరల్, మార్చి 7(ఆంధ్రజ్యోతి): నంద్యాల జగజ్జననీ నగర్‌లో వెలసిన జగజ్జననీ దేవి షోడశ వార్షికోత్సవంలో భాగంగా శుక్రవారం ఉదయం ప్రభాతపూజ నిర్వహించారు. భక్తులు అమ్మవారికి సహస్ర కలశ క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం మహా మంగళ హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు.భక్తులు తమ ఇంటివద్ద నుండి గండాదీపాలు వెలిగించి అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. అలాగే అన్ని రకాల పండ్లను దండలుగా కట్టి అమ్మవారికి సమర్పించుకున్నారు. సాయంత్రం ప్రదోష పూజ కార్యక్రమాలు, మహా మంగళహారతి నిర్వహించారు. మార్కాపురం ముత్తలూరు దత్తాత్రేయ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు దుర్గా ఫ్రెండ్స్ యూనిట్ సభ్యులు తీర్థప్రసాదం పంపిణీ చేశారు.

'రోగి సంరక్షణకు మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలి'

పాణ్యం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థులు ఔషదాలను అభివృద్ధిపరిచి రోగి సంరక్షణకు మరిన్ని ఆవిష్కరణలు చేపట్టాలని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అజ్మాన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ గౌరవ్ గుప్తా సూచించారు. శాంతిరాం ఫార్మసీ కళాశాలలో శుక్రవారం ఇండో - కరేబియన్ అంతర్జాతీయ ఔషద సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మురళీధరరావు, శాంతిరాం కళాశాల చైర్మన్ డాక్టర్ శాంతిరాముడు, అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్ అధ్యక్షుడు ప్రొఫెసర్ రాజు దహియా, డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్‌చెట్టి పాల్గొన్నారు. సదస్సులో ఔషధ రూపకల్పన, అభివృద్ధి, విశ్లేషణ, రోగి సంరక్షణలో ఆవిష్కరణలు అనే అంశంపై అసోసియేషన్ ఆఫ్ ఫార్మసీ ప్రొఫెషనల్స్, శాంతిరాం ఫార్మసీ కళాశాల సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించారు. ఔషద పరిశోధన సీడీలను ఆవిష్కరిరచారు. మందుల తయారీలో ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలకు చెందిన 28 పార్మశీ కళాశాలల విద్యార్థులు వెయ్యి మంది పాల్గొన్నారు. సదస్సులో పరిశోధ అంశములను మూల్యాంకనం చేసి ఉత్తమ పరిశోధన పత్రం సమర్పించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఇంట్లో భారీ చోరీ

రూ. 20 లక్షలు విలువ చేసే బంగారు, నగదు అపహరణ


విచారిస్తున్న పోలీసులు

నంద్యాల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): నంద్యాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైతు నగరం శివారు ప్రాంతంలోని శివసాయి గ్రీన్‌హోమ్స్‌లో శుక్రవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. శివసాయి గ్రీన్‌హోమ్స్‌లో నివాసముంటున్న టీడీపీ నాయకుడు కోదండరెడ్డి దంపతులు రాత్రి సుమారు 8 గంటల సమయంలో పట్టణంలోని నవమన్‌నగర్‌లోని తమ కుమార్తె ఇంటికి వెళ్లారు. ఆ సమయంలో దొంగలు ఇంటికి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న రూ.20 లక్షల విలువ గల 30 తులాల బంగారు ఆభరణాలు, రూ. 15వేలు నగదు అపహరించుకొని వెళ్లారు. చోరీ చేసి తర్వాత మళ్లీ యథావిధిగా విద్యుత్ సరఫరా ఇంటికి పునరుద్ధరించి పరారయ్యారు. ఇంటికి తిరిగి వచ్చిన కోదండరెడ్డి దంపతులు తాళాలు పగలి ఉండడం గమనించి ఇంట్లో చోరీ జరిగిందన్న విషయం తెలుసుకొని నంద్యాల రూరల్‌పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న నంద్యాల ఎస్‌డీపీవో జావలి ఆల్ఫోన్స్, రూరల్ సీఐ ఈశ్వరయ్య, సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీంను రప్పించి వేలి ముద్ర నమూనాలను సేకరించారు. తాలుకా పోలీసులు బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నల్లమలలో మంటలు


మహానంది సమీపంలోని నల్లమల అడవిలో కాలిపోతున్న చెట్లు

మహానంది, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గత 10 రోజుల నుంచి నల్లమల అడవి నిప్పునకు గురై కాలిపోతోంది. దీంతో అందులోని వన్యప్రాణులు ప్రాణభయంతో పురుగులు తీస్తూ కొన్ని ప్రాణులు కాపాడుకొంటున్నా...మరికొన్ని భయంతో ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇదిలా ఉండగా నల్లమల సమీప గ్రామాల ప్రజలు వేసవి కాలంలో అడవికి నిప్పు అంటుకోవడంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏడాది ఇలా జరుగుతున్నా అటవీశాఖ అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టక పోవడంపై పలువురు విమర్శిస్తున్నారు.

వేలాది హెకార్లల్లో విస్తరించి ఉన్న నల్లమల అడవిలో మంటలు చెలరేగి నప్పుడు అరకొర సిబ్బందితో మంటలను నివారించడం సాధ్యం కావడంలేదు. అగ్నిమాపక వాహనాలు దట్టమైన అడవిలోకి వెళ్లడం వీలు కుదరడం లేదు. పైగా వేషవికాలం కావడంతో నీటినిల్వలు పూర్తిగా అంతరించి పోవడంతో సిబ్బందికి మంటలను ఆర్పడం కత్తిమీద సాములాగా మారింది. శుక్రవారం మహానంది సమీపంలోని నల్లమల అడవిలో చెలరేగిన మంటలను ఆర్పేందుకు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి ఆధ్వర్యంలో 6 మంది సిబ్బంది ఉదయం నుంచి రాత్రి వరకు మంటలను అదుపులోకి తెచ్చేందుకు శ్రమించిన సాధ్యం కాలేదు.

డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమావతి మాట్లాడుతూ ఆకతాయిలు చేస్తున్న వికృత చేష్టల వల్ల అడవికి నిప్పు అంటుకొని కాలిపోతోందని అన్నారు. దీనిపై ముందు జాగ్రత్తగా చర్యలుగా ఉన్న సిబ్బందికి అటవీశాఖ ఉన్నతాధికార్లు శిక్షణ ఇచ్చామని చెప్పారు. సాధ్యమైనంత వరకు సిబ్బందితో మంటలను అదుపులోకి తీసుకొని రావడానికి ప్రయత్నిస్తున్నామన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

12న దస్తగిరిస్వామి ఉరుసు

చాగలమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామంలో వెలసిన హజరత్ దస్తగిరిస్వామి ఉరుసు 12 నుంచి ప్రారంభమవుతాయని దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. 12న గంధం, 13న ఉరుసు మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. 9నుంచి భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉత్సవాలను విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆళ్లగడ్డ రూరల్ ఎస్ఐ హరిప్రసాద్, ఏఎస్ఐ నబీసాహేబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

● **రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు**

మండలంలోని పెద్దవంగలి గ్రామంలో 13నుంచి బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతలు నగదు అందజేస్తామని అన్నారు.

వైభవంగా చండీ హోమం

చాగలమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేద పండితుడు పెద్దశాస్త్రీ ఆధ్వర్యంలో శుక్రవారం గణపతి, చండీ, రుద్రహోమాలను ఉభయదారులచే వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం ప్రజలు సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక హోమాలు చేశారు. మహిళలు సామూహికంగా అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం చేశారు. వెండి రథంలో అమ్మవారిని కొలువుదీరింప చేసి ఉత్సవం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కోశాధికారి నవత ప్రసాద్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్‌కు సామగ్రి అందజేత

డోన్ టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ ఉమెన్స్ హాస్టల్‌కు ఫోకస్ లైట్లు, ట్యూబ్‌లైట్లు, వాటర్ పైపులు, కుర్చీలు, టేబుల్స్ అదే విధంగా పట్టణం సమీపాన ఏపీ మోడల్ స్కూల్‌కు ఆరు చార్జింగ్ లైట్లు, ట్యూబ్‌లైట్లు ఐదు వాటర్ క్యాన్లు అలాగే పదవ తరగతి 96 విద్యార్థులకు పరీక్షలకు సంబంధించిన సామగ్రిని అందించినట్లు స్వామి వివేకానంద సభ్యులు జగన్మోహన్, నాగభూషణం రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దాత మారెల్ల రాజశేఖర్ రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులు, కుళ్లాయప్ప, గంగిశెట్టి, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

చాగలమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పశువుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్దబోధనం, తిప్పనపల్లె గ్రామాల్లో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. పశువైద్యాధికారి సాయిబాబా, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

500 క్యూసెక్కుల నీటి ప్రవాహం

చాగలమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద 500 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు కేసీ కెనాల్ డీఈ పుల్లయ్య, ఏఈ జమాల్‌వలి తెలిపారు. శుక్రవారం ఆనకట్ట వద్ద ఉన్న నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. వారి వెంట సూపర్‌వైజర్ దస్తగిరి, లస్కర్లు ఉన్నారు.

యువతకు మెరుగైన అవకాశాలు

ఆళ్లగడ్డ (శిరివెళ్ల), మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ తెలిపారు. అసెంబ్లీ అనంతరం ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ నియోజకవర్గ సమస్యలు, నిధుల సమీకరణపై మంత్రి లోకేష్‌తో శుక్రవారం చర్చించారు.

వ్యవసాయ బోరు బావుల కేబుల్ చోరీ

రుద్రవరం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామం సమీపంలోని వ్యవసాయ బోరు బావుల కేబులు చోరీకి గురైనట్లు శుక్రవారం రైతులు వెంకోబారావు, దస్తగిరిరెడ్డి, పక్కీరా, వెంకట సుబ్బయ్యతో పాటు పలువురు రైతులు శుక్రవారం తెలిపారు. ఇప్పటికీ రెండుసార్లు మోటార్ల కేబుల్ చోరీ గురయ్యాయని చెప్పారు. సుమారు రూ.50,000విలువ ఉంటుందన్నారు. మళ్లీ కేబుల్ తెచ్చుకునే ఏర్పాటు చేసుకోవడానికి ఇబ్బంది పడుతున్నట్లు రైతులు తెలిపారు.

తుండ్లవాగు రిజర్వాయర్‌కు గంగ నీరు

రుద్రవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : తుండ్లవాగు రిజర్వాయర్‌కు తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి నీరు చేరుతోందని తెలుగుగంగ అధికారులు శుక్రవారం తెలిపారు. మొన్నటి వరకు రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గి ఉండేది. గంగనీరు చేరడంతో రిజర్వాయర్‌లో నీటి సామర్థ్యం పెరిగిందన్నారు.

శ్మశానం దారి కబ్జా : తహసీల్దార్‌కు ఫిర్యాదు

సంజామల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరుసోల గ్రామంలో మాదిగలకు సంబంధించిన శ్మశానం దారిని స్థానిక నాయకులు కబ్జా చేశారని దళితులు అన్నారు. శుక్రవారం పేరుసోమల మహిళలు, దళితులు, తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు.

తోళ్లమడుగులో పశువైద్య శిబిరం

కొలిమిగుండ్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తోళ్లమడుగు గ్రామంలో అనంతపురం జిల్లా సరిహద్దు ప్రాంతంలో ఉన్న అదానీ సిమెంట్స్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కొలిమిగుండ్ల పశు వైద్యాధికారి రమేశ్‌బాబు పశువులను పరీక్షించారు. పాడి రైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొలిమిగుండ్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కొలిమిగుండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో రామ్‌కో సిమెంట్ పరిశ్రమ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఏజీఎం సెంథిల్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రామ్‌కో యూనిట్ హెడ్ రెడ్డి నాగరాజు, ప్రతినిధులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు హుసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యం పెంచుకోవాలి

కొలిమిగుండ్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు బోధనా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంఈవో అబ్దుల్‌కలాం అన్నారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో ఉపాధ్యాయులకు టీచ్ టూల్ పై శిక్షణ ఇచ్చారు. జిల్లా కో-ఆర్డినేటర్ నవీన్, హెచ్ఎంలు పాల్గొన్నారు.

పెద్దమ్మ జాతరకు ఏర్పాట్లు ముమ్మరం

దొర్నిపాడు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డబ్ల్యూ. గోవిందిన్నెలో మూలపెద్దమ్మ జాతర నిర్వహించేందుకు కమిటీ సభ్యులు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ మండల అధ్యక్షుడు భూమా బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. జాతరను జూన్ 8, 9, 10 తేదీల్లో నిర్వహించేందుకు కమిటీ సభ్యులు నిర్ణయించారు.

కుటుంబానికి అండ

● స్వయం ఉపాధితో రాణిస్తున్న మహిళలు

చాగలమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా రాణిస్తున్నారు. వ్యవసాయం మొదలుకొని అన్ని రంగాల్లో మహిళలు ముందుండి తాము ఏ రంగంలోను తక్కువకాదని నిరూపించుకుంటున్నారు. ఓవైపు ఇంటి పనులు, పిల్లలను చూసుకుంటునే వ్యాపారాల్లో రాణిస్తూ కుటుంబానికి అండగా నిలుస్తున్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా పలువురు మహిళల అభిప్రాయాలు ఇలా..


చాగలమర్రిలో శీతలపానీయాల దుకాణం నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి

రాజస్థాన్ నుంచి వచ్చి..



రాజస్థాన్ నుంచి చాగలమర్రికి వచ్చాం. ఇక్కడ సమోసా, జిలేబి దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాం. భర్తకు తోడుగా దుకాణం నిర్వహిస్తున్నా. సొంత రాష్ట్రాన్ని వదిలి 25 ఏళ్లుగా చాగలమర్రిలో జీవనం సాగిస్తున్నాం. రోజుకు రూ.4 వేల వ్యాపారం జరుగుతుంది. ఆదాయం రూ.1000 దాకా వస్తోంది. దీంతో భర్త, పిల్లలతో జీవనం సాగిస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు లేవు. కష్టానికి తగ్గ ఫలితం ఉంది.

- అనితాదేవి, చాగలమర్రి

ఉపాధి పొందుతూ...



నేను నేర్చుకున్న టైలరింగ్‌తో జీవనం సాగిస్తున్నా. పొదుపు సభ్యురాలిగా ఉంటూ రూ.లక్ష రుణం తీసుకున్నా. టైలరింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేశా. నేను ఉపాధి పొందుతూనే పది మందికి ఉపాధి కల్పిస్తున్నా. 12 ఏళ్ల నుంచి టైలరింగ్ వృత్తి కొనసాగిస్తూ 50 మందికి మహిళలకు శిక్షణ ఇచ్చా. పది మందికి ఉపాధి కల్పించడం, కుటుంబానికి ఆసరాగా ఉండటం సంతృప్తిగా ఉంది.

- రజియాబేగం, చాగలమర్రి

స్వయం ఉపాధితో రాణిస్తున్నా..



స్వయం ఉపాధితో రాణిస్తున్నాం. భర్త సహకారంతో కంటి అద్దాల దుకాణం ఏర్పాటు చేసుకున్న ఐ-మిత్ర సంస్థ ద్వారా కంటి అద్దాల దుకాణం నిర్వహిస్తున్నాం. దీంతో వచ్చే ఆదాయంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా బతుకుతున్నాం. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే మంచి ఫలితం ఉంటుంది.

- షణ్ముఖేశ్వరి, చాగలమర్రి

కుటుంబానికి మహిళనే ఆదర్శం



స్వయం ఉపాధితో మహిళలు రాణించాలి. సమాజంలో పురుషులతో పాటు మహిళలు కూడా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కుటుంబ భారం తొలగేందుకు మహిళల చొరవ ప్రత్యేకం. శారీస్ కేంద్రం ఏర్పాటు చేసి పలువురు మహిళలకు ఆదర్శంగా నిలిచారు.

- ఫరీదా, చాగలమర్రి

అహోబిలేశా.. నమోస్తుతే

● అంగరంగ వైభవంగా అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలు
● చలువ పందిళ్లు, స్వాగత తోరణాలతో భక్తులకు ఆహ్వానం
● గరుడ సేవ, కల్యాణోత్సవ సమయంలో పెరగనున్న భక్తుల రద్దీ


విద్యుద్దీపాల అలంకరణలో దిగువ అహోబిల రాజగోపురం


దిగువ అహోబిల క్షేత్రంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన చలువ పందిళ్లు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 7(ఆంధ్రజ్యోతి) : ఆళ్లగడ్డ పరిధిలోని ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన దిగువ, ఎగువ అహోబిల క్షేత్రాల్లో నారసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయాల రాజగోపురాలను, మాడవీధులను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకునే భక్తులకు నిర్వాహకులు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పరిసరాల్లో, మాడ వీధుల్లో చలువ పందిళ్ల సిద్ధం చేశారు. ఎగువ అహోబిలం వెళ్లే రహదారిలో స్వాగత ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ పర్యవేక్షణలో ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో వేడుకలు జరుగుతున్నాయి.

● **దేవదేవుని పెళ్లికి ఆహ్వానం**

ఎగువ అహోబిలంలో ఈ నెల 11న జ్వాలానరసింహస్వామి, చెంచులక్ష్మీ అమ్మవారి కల్యాణోత్సవం, 13న రథోత్సవం, 14న గరుడ సేవ నిర్వహించనున్నారు. అలాగే దిగువ అహోబిలంలో 12న ప్రహ్లాదవరదస్వామి కల్యాణోత్సవం, 14న రథోత్సవం, 15న గరుడసేవ వైభవోపేతంగా నిర్వహించేందుకు మఠం నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత ఏడాది జరిగిన అహోబిలేశుడి బ్రహ్మోత్సవాలకు తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల నుంచి దాదాపు 75 వేల మంది భక్తులు రాగా ఈ ఏడాది లక్ష మంది దాకా వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

● **ఏర్పాట్లను పరిశీలించిన ఆర్డీవో**

అహోబిలం లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను నంద్యాల ఆర్డీవో విశ్వనాథ్ శుక్రవారం పరిశీలించారు. భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మౌళిక వసతులను ఆయన పరిశీలించారు. బీగాల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం వద్ద రహదారిపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను ఖాళీ చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట ఆళ్లగడ్డ తహసీల్దార్ జ్యోతి రత్న కుమారి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయ భవనం పరిశీలన

డోన్ రూరల్/టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): డోన్ పట్టణం ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేయనున్న కేంద్రీయ విద్యాలయ నూతన భవనం గదులను రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఏప్రిల్ 1 నుంచి కేంద్రీయ విద్యాలయ తరగతులు జరుగుతున్న నేపథ్యంలో ఆయన ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన నూతన భవనాన్ని పరిశీలించారు. అలాగే కియా సెంటర్‌ను పరిశీలించారు. బుగ్గన వెంట డోన్ ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుశేన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి వలంటరీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టు ప్రసాద్, పట్టణ యువ నాయకులు ఆర్ఈ రాజావర్ధన్ తదితరులున్నారు.


నూతన భవనాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి బుగ్గన

అంతర్జాతీయ పోటీలకు పీడీ బాషా ఎంపిక


పీడీ బాషాను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంజామల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు సంజామల ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ బాషా ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేసి సహచర ఉపాధ్యాయులు , విద్యార్థులు బాషాను సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ త్వరలో అంతర్జాతీయస్థాయిలో ఇండోనేషియాలో జరిగే అంతర్జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశం తరుపున బాషా పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయులు హుసేనయ్య, అరుణ కుమారి చంద్రశేఖర్, వెంకట రంగన్న, మాధవ క్రిష్ణా రెడ్డి, ఖాసీం బాషా పాల్గొన్నారు.

విద్యార్థినులు మనోధైర్యంతో ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న నీరజ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు మనోధైర్యం కలిగి ఉండాలని తిరుపతి ఐఐటీకి చెందిన సైకాలజిస్ట్ డాక్టర్ నీరజ సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో పడకండ్లలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో శుక్ర వారం సమావేశం నిర్వ హించారు. పలు అంశాలపై ఆమె ఆమె అవగాహన కల్పించారు. సమావేశంలో హెచ్ఎం ఫిర్దోస్, ప్రైవేట్ పాఠశాలల నియోజకవర్గ అధ్యక్షుడు అమీర్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిచ్చి కుక్క వీరంగం.. 9మందికి గాయాలు

సంజామల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పిచ్చికుక్క వీరంగం చేసింది. గురువారం రాత్రి గ్రామంలో తొమ్మిది మంది ఇమామ్ హుసేన్, లక్ష్మన్న, పూజారి, మరో ఆరుగురిపై కుక్క దాడి చేసింది. పీహెచ్‌సీ వైద్యం చేయించుకున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లలిత

బనగానపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ లలిత శుక్రవారం అన్నారు. అంతర్జాతీయ మహిళ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాల విద్యార్థులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మహిళల సాధికారత లేకుండా సమాజ అభివృద్ధి సాధ్యం కాదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బడేసాహెబ్, ఎస్ఎండీగౌస్, రామకృష్ణ, బాబునాథ్, నాగరాజారెడ్డి, వరలక్ష్మి, చంద్రకళ, రవికుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

వైభవంగా మద్దిలేటి స్వామి క్షేత్రంలో తిరుచ్చి

బేతంచెర్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి స్వామి క్షేత్రంలో శుక్రవారం తిరుచ్చి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ఉదయం ప్రత్యేక పూజలు నిర్వ హించారు. సాయంత్రం ఉత్సవ మూర్తులను పల్లకిలో ఏర్పాటు చేసి ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

ఇంటర్ పరీక్షా కేంద్రం తనిఖీ

చాగలమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రిలోని వాసవీ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పబ్లిక్ పరీక్షలను జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి రామకృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేశారు. మాస్ కాపీంగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట పోలీసులు ఉన్నారు.

శివరాం థియేటర్ వద్ద పోలీస్ బందోబస్తు

బనగానపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివరాం థియేటర్ వద్ద శుక్రవారం పోలీసులు బందోబస్తు నిర్వహించారు. హిందీలో విడుదలై రికార్డులు సృష్టిస్తున్న ఛావ సినిమా అల్లు అరవింద్ సారథ్యంలో తెలుగులో డబ్ చేసి మొగల్ చక్రవర్తి ఔరంగజేబు చరిత్రను వక్రీకరించారని ఓ వర్గం సినిమా విడుదల నిలుపుదల చేయాలని హెచ్చరికలు జారీ చేశారు. శివరాం థియేటర్‌లో సినిమాను ప్రదర్శిస్తున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ దుగ్గిరెడ్డి పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



పాడితో ప్రగతి

● గేదెల పాలతో కుటుంబ పోషణ
● మహిళలకు స్ఫూర్తిగా సురేఖ, మాబుచాన్


గేదెల నుంచి పాలను పిండుతున్న సురేఖ

చాగలమర్రి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమతో లాభాలు సాధిస్తున్నారు. ఎవరిపైనా ఆధారపడకుండా కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. చాగలమర్రికి చెందిన సురేఖ రెండు గేదెలతో పాడిని ప్రారంభించి ప్రస్తుతం 25 గేదెలతో నడిపిస్తున్నారు. మల్లేవేముల రహదారిలో ఉంటున్న సురేఖ, సురేష్‌బాబు దంపతులది మధ్యతరగతి రైతు కుటుంబం. వీరికి ఇద్దరు సంతానం. కుమార్తె లిఖిత టెట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి డీఎస్సీకి శిక్షణ పొందుతోంది. కృష్ణవంశీ బీటెక్ చదువుతున్నాడు. పిల్లలు పెరిగే కొద్ది ఆర్థిక సమస్యలు ఎక్కువయ్యాయి. దీంతో సమస్యల నుంచి గట్టెక్కేందుకు సురేఖ పాడి వైపు దృష్టి సారించింది. పదేళ్ల క్రితం రెండు గేదెలను కొనుగోలు చేసి అర ఎకరా స్థలాన్ని ఏడాదికి రూ.36 వేల అద్దెతో లీజుకు తీసుకున్నారు. ఇందులో గేదెలకు రేకుల షెడ్డు ఏర్పాటు చేశారు. పాల ఉత్పత్తిలో మంచి లాభాలు రావడంతో మరింత విస్తృత పరిచారు. ప్రస్తుతం 25 గేదెలను పోషిస్తున్నారు. 13 గేదెలు, 12 దూడలు ఉన్నాయి. రోజుకు 72 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోంది. పశు పోషణ కోసం రూ.70 వేలు ఖర్చు చేస్తున్నారు. ఖర్చులు పోగా రూ.30 వేలు దాకా ఆదాయం వస్తోంది. గత ఐదేళ్లలో దాన, గడ్డి విత్తనాలు అందలేదు. వచ్చిన డబ్బులతోనే పాడిపరిశ్రమకు వెచ్చిస్తూ ముందుకు సాగుతున్నారు. పొదుపు సంఘం సభ్యురాలిగా ఇతరులకు స్ఫూర్తినిస్తున్నారు.


గేదెలకు మేత వేస్తున్న మాబుచాన్

● చాగలమర్రి గ్రామానికి చెందిన మాబుచాన్ పాడిపరిశ్రమలో మహిళలకు ఆదర్శంగా నిలిచారు. పదేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త చనిపోయాడు. మాబుచాన్‌కు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. భర్త లేకున్నా ఆత్మస్థైర్యంతో వ్యవసాయం చేసేందుకు పొలాలను కౌలుకు తీసుకుంది. పంటలు సరిగా పండక నష్టపోవాల్సి వచ్చింది. ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. పిల్లల పోషణ భారంగా మారింది. ఈ క్రమంలోనే సౌదికి వెళ్లి ఐదేళ్లపాటు అక్కడ పని చేసుకుంటూ జీవనం సాగించింది. ఆర్థికంగా కొంత మేర నిలదొక్కుకుంది. తిరిగి స్వగ్రామం చాగలమర్రికి చేరుకుంది. ఏడేళ్ల క్రితం రెండు గేదెలను కొనుగోలు చేసి పాడిపరిశ్రమ మొదలు పెట్టింది. ప్రస్తుతం ఎనిమిది గేదెలు, 12 దూడలతో పశుపోషణ చేస్తోంది. ఆర్థికంగా పుంజుకొని కూతురు వివాహం చేసింది. పాడి గేదెల నిర్వహణకు నెలకు రూ.6 వేలు దాకా ఖర్చు చేస్తోంది. ఖర్చులు పోగా నెలకు రూ.25 వేల దాకా ఆదాయం వస్తోందని ఆమె చెబుతోంది.

ఇది ప్రజా ప్రభుత్వం

● సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి


వినతిని పరిశీలిస్తున్న సుబ్బారెడ్డి

డోన్ రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్డీ యే కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన ప్రజావేదికలో వినతులు స్వీకరించారు. బాధితుల సమస్యలను విని వాటి పరిష్కారం కోసం ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.

నీటి క్లోరినేషన్ పరికరాల ఏర్పాటు

కొలిమిగుండ్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో తాగునీటి సరఫరా సమయంలో నీటిని శుద్ధి చేయడానికి ప్రత్యేక పరికరాలు అమర్చినట్లు పెట్నీకోట పంచాయతీ కార్యదర్శి రాఘవరెడ్డి వెల్లడించారు. పెట్నీకోట, నాయినిపల్లె, ఇటిక్యాల గ్రామాల్లో నీటి క్లోరినేషన్ కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గ్రామాల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయడమే పంచాయతీ ప్రధాన ఉద్దేశమన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం

బనగానపల్లె, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : యాగంటిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలు విజయవంతం కావటం సంతోషదాయకమని టీడీపీ నాయకుడు మౌళీశ్వరరెడ్డి శుక్రవారం అన్నారు. శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కీలకంగా వ్యవహించిన ఈవోపీఆర్డీ సతీష్‌రెడ్డి, ఈవో చంద్రుడిని ఉమామహేశ్వరస్వామి చిత్రపటాన్ని అందించి సన్మానించారు.

కలప తరలిస్తున్న వాహనం స్వాధీనం

బేతంచెర్ల, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : రేపల్లె గ్రామ సమీపంలోని అడవిలో నుంచి కలప ను తరలిస్తున్న వాహనాన్ని శుక్రవారం ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రమణారెడ్డి సీజ్ చేశారు. అయితే మినీ లారీలో పెద్దపెద్ద దుంగలు ఉండగా సదురు అధి కారి మాత్రం వంట చెరుకు అని చెప్పడం గమనార్హం. పట్టుబడ్డ మినీ లారీని అధికారులు పోలీస్‌స్టేషన్‌కు లేదా ఫారెస్టు శాఖ కార్యాలయానికి తరలించాల్సి ఉన్నా ఒక ప్రైవేటు కలప గోడౌన్‌కు తరలించడం చర్చనీయంశంగా మారింది.

రుద్రవరంలో ఇఫ్తార్

రుద్రవరం, మార్చి 7(ఆంధ్రజ్యోతి) : రుద్రవరం జామియా మసీదులో శుక్రవారం రఫి అనే వ్యక్తి ఉపవాసం ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. దాదాపు 200మంది విందు ఏర్పాటు చేశారు. ఇఫ్తార్ విందు అనంతరం ప్రత్యేక దువా చేశారు.